క్లుప్తంగా

పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

వేంపల్లె : పట్టణపరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ జేఈ చంద్రశేఖర్ తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 7.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. స్థానిక పులివెందుల రోడ్డులోని కందుల కాంప్లెక్స్ (కొత్తది), బిజిఎస్ ఎలక్ట్రానిక్స్, రాయచోటి బైపాస్‌రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, ఆర్ఎస్ కాలనీ, ఎస్ఎస్ఆర్ కళ్యాణ మండపం, ఫైర్ స్టేషన్, ఏపీ గురుకుల పాఠశాల, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, రైతులు, వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఎంప్లాయీస్ యూనియన్ నూతన కమిటీ ఎంపిక

జమ్మలమడుగు రూరల్ : ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కమిటీ ఎంపికను ఆదివారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎఆర్.మూర్తి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎంపికను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిపో అధ్యక్షుడిగా ఆర్.జి.రెడ్డి, ఉపాధ్యక్షుడిగా జి.వి.ఎస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.వి.శివారెడ్డి, డి.పి.రెడ్డి, డిపో సెక్రటరీగా జె.ఫాజిల్ బాషా, ట్రెజరర్ చంద్రశేఖర్, కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఉచితంగా మందుల పంపిణీ



స్వర్ణబిందు ప్రాసన మందును పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

జమ్మలమడుగు : పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుష్ యోగ మందులను ఆదివారం పంపిణీ చేశారు. పుష్యమి నక్షత్రం సందర్భంగా పుట్టిన పిల్లలు మొదలుకుని 16 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలకు స్వర్ణ బిందు ప్రాసన మందు ఉచితంగా ఇవ్వడం జరిగిందని అధ్యక్షుడు శరణాకిశోర్ తెలిపారు. పిల్లలకు 12 నెలల పాటు ఈ మందు ఇవ్వడం ద్వారా జీర్ణశక్తి, రోగ నిరోధక శక్తి జ్ఞాపకశక్తి, బుద్ధిబలము పెరుగుతుందన్నారు. తొలిరోజు 500 మంది పిల్లలకు మందును పంపిణీ చేశామన్నారు.

జూదరులు అరెస్ట్

చింతకొమ్మదిన్నె : కడప నగర పరిధిలోని 16వ డివిజన్ ఇందిరానగర్‌లో జూదమాడుతున్న ఆరుగురిని ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు సీకేదిన్నె ఎస్ఐ బి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వారివద్ద నుంచి రూ.3200 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేత



హైదరాబాద్‌కు వెళ్ల ప్రతాప్‌రెడ్డికి ఫించన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ యొహాన్

పెద్దముడియం : మండలంలోని గుండ్లకుంట గ్రామంలోని ఉమ్మడి ప్రతాప్‌రెడ్డి అనారోగ్య కారణంగా హైదరాబాద్‌లోని ఓ హాస్పిటల్ చికిత్స తీసుకుంటూ అక్కడే ఉన్న తన కూతురు దగ్గర ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్ యొహాన్‌కు తెలియజేయటంతో యోహాన్ హైదరాబాద్‌కు వెళ్లి ప్రతాప్‌రెడ్డికి ఫించన్ అందజేశారు.

సమసమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే

వేంపల్లె : సమసమాజ నిర్మాణం కోసం పాటుపడిన వ్యక్తులు ఉపాధ్యాయులేనని వేంపల్లె వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్ఎస్ఆర్ కళ్యాణమండపంలో నరసింహారెడ్డి స్వచ్ఛంద పదవీ విరమణ సన్మానం సభ నిర్వహించారు. స్థానిక మెయిన్ బజార్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్‌గా పనిచేస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ చేయడం చాలా బాధాకరంగా ఉందన్నారు. ఉపాధ్యాయ సమస్యల కోసం నిరంతరం పోరాడేవాడన్నారు. అనంతరం ఉపాధ్యాయ సంఘం నేతలు, ఉపాధ్యాయులు, అధికారులు నరసింహారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎంఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం

కడప కార్పొరేషన్: జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. జిల్లాలో కొన్ని రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ వేడిమి, ఉక్కపోతకు జనం అల్లాడిపోతున్నారు. ఆదివారం అందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది. ఈ చల్లటి వాతావరణం ప్రజలకు కాస్త ఉపశమనం కలిగించింది. రాబోవు నాలుగైదు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో ఈ తరహా వాతావరణం నెలకొందని పలువురు భావిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు



కషాయాలను తయారు చేస్తున్న మహిళారైతు రజిత



పంటలోని గడ్డిని మిషన్ ద్వారా తొలగిస్తూ..

సింహాద్రిపురం : మండల కేంద్రంలోని పెద్దగంగన్నగారి రజిత అనే మహిళారైతు తనకున్న 1.20 ఎకరాల పొలంలో మూడు సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఎలాంటి రసాయన మందులు వాడకుండా వ్యవసాయం చేస్తూ లాభాలు ఘడిస్తోంది. మహిళారైతు రజిత సొంతంగా వివిధ రకాల కషాయాలు, ద్రావణాలు తయారు చేసుకుని తన చీనీతోటలో ఏటీఎం మోడల్ పద్ధతిలో అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. స్థానిక మార్కెట్‌లో స్వయంగా తానే రైతులకు మార్కెటింగ్ చేస్తోంది. ఆదివారం మహిళా సంఘాల సభ్యులకు, రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్తగా రైతులకు సహకరిస్తు వారి మన్ననలు పొందుతోంది.

పూడికతీత పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



పనుల వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : మైలవరం జలాశయం ఉత్తర కాలువకు ఉపకాలువ అయిన నొస్సం బ్రాంచ్ కాలువలో జంబు తొలగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సొంత నిధులు వెచ్చించి పనులను ఆదివారం ఉప్పలపాడు గ్రామ సమీపంలో ప్రారంభించి మాట్లాడారు. సరైన వర్షాలు లేకపోవడంతో వేసిన పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. కాలువలో నీరు జంబు ఎక్కువగా ఉండటంతో ముందుకు కదలడంలేదని రైతులు తమ దృష్టికి తీసుకురావడంతో నొస్సం బ్రాంచ్ కాలువలో పూడిక తీత పనులతోపాటు జంబును తొలగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

ఎర్రగుంట్ల : పట్టణంలోని మున్సిపల్ కౌన్సిలర్ దాసరి లక్ష్మీదేవి, కో ఆప్షన్ సభ్యులు దాసరి సూర్యనారాయణరెడ్డిల కుమారుడు దాసరి సంతోష్‌కుమార్‌రెడ్డి, అమృతరెడ్డిల వివాహం జరిగింది. ఆదివారం వీరపునాయునిపల్లె మండలంలోని అంకిరెడ్డి పల్లె గ్రామంలో వధువు ఇంటి వద్ద జరిగిన మల్లిపెళ్లి వేడుకలకు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డిలు పాల్గొని వధువరులను ఆశ్వీరిదించారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట-బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులు ఆలయ ఆవరణలో విందుభోజనాలు చేశారు. అలాగే ఆలయ సమీపంలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మల్లేలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మండలంలోని మద్దిమడుగు గ్రామంలో వెలసిన మల్లేలమ్మతల్లికి ఆదివారం కమలాపురం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నకాంపల్లి సర్పంచ్ మల్లిఖార్జున యాదవ్ తన సొంత నిధులతో పంచాయతీ పరిధిలోని ప్రజల దాహర్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన బోరుబావిలో తాగునీరు పుష్కలంగా పడటంతో నూతన మోటారును ఏర్పాటు చేశారు. ఆయన స్విచ్ ఆన్ చేసి ప్రజలకు నీరు అందించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అచ్చువెల్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అచ్చువెల్లి గ్రామ సమీపంలో వెలసిన అచ్చువెల్లి గంగమ్మకు ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే గంగమ్మగా అచ్చువెల్లి గంగమ్మ ఎంతో ప్రసిద్ధిగాంచింది. కోరిన కోరికలు తీరడంతో కడప జిల్లా నుంచే కాక అనంతపురం, కర్నూలు, తదితర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు.

చిరుధాన్యాల వంటకాలకు భలే గిరాకీ



జొన్నపిండితో అమ్మకానికి రొట్టెలు తయారు చేస్తున్న మహిళ

పులివెందుల రూరల్ : చిరుధాన్యాలతో తయారు చేసే జొన్నరొట్టెలు, రాగిసంగటి, రాగిరొట్టె, రాగిమాల్ట్‌లపై ప్రజలు మక్కువ చూపిస్తున్నారు. చిరుధాన్యాలంటే కొర్రలు, జొన్నలు, రాగులు, సజ్జలు, ఊదలు మొదలైనవి. వీటిని తృణ ధాన్యాలు అని కూడా అంటారు. ఎప్పుడో బ్రిటీష్ వారు తాము తింటున్న బియ్యం, గోధుమలు మాత్రమే గొప్పవని, మిగిలినవి తక్కువ రకానికి చెందినవని భావించారు. పైగా ఎక్కువ మంది భారతీయులు తింటున్న ఈ రెండవ రకానికి తృణ(తక్కువ) ధాన్యాలు అని పేరు పెట్టారు. 1990కి ముందు మన దేశంలో ప్రజలు అధిక శాతం మంది ఈ చిరు ధాన్యాలను తినేవా రు. 1980కి ముందైతే కొన్ని కుటుంబాలు ఏ పండుగో.. పబ్బమో..పెళ్లి లేదా కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగలేకపోయినప్పుడే చిరు ధాన్యాలను కాదని బియ్యం అన్నం తినే యోగం కలిగేది. చిరుధాన్యాలు ప్రధానంగా వర్షాధారపు పంటలు, తక్కువ వర్షం పడినా ఇవి పండుతాయి. అందుకే ప్రత్యేకించి రాయలసీమ ప్రాంతంలో చిరుధాన్యాలు ఒకప్పుడు ఎక్కువగా పండించేవారు. కాలక్రమంలో వ్యవసాయం తగ్గిపోవడంతోపాటు చిరు ధాన్యాలను పండించడం కూడా బాగా తగ్గిపోయింది. ప్రస్తుత కంప్యూటర్ కాలంలో ప్రజలందరు బిజీబిజీగా గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో జొన్నలు, రాగులతో తయారుచేసిన పిండివంటలకు మంచి గిరాకీ ఏర్పడింది. దీంతో పులివెందుల పట్టణంలోని పాతమార్కెట్, పార్నపల్లెరోడ్డు, మెయిన్‌రోడ్డు, పూలఅంగళ్లు, ముద్దనూరు రోడ్డు, జెండామానువీధి, బ్రాహ్మణపల్లెరోడ్డు, తదితర ప్రాంతాల్లో జొన్న, రాగిరొట్టెలు అమ్ముతూ వ్యాపారం చేస్తున్నారు. పూర్వకాలం మాదిరి ఆరోగ్యంగా ఉండాలంటే ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరు జొన్నరొట్టెలు, రాగిరొట్టెలతో పాటు జొన్న సంగటి, రాగిసంగటి తింటే ఆరోగ్యంగా ఉంటారని వైద్యనిపుణులు కూడా చెబుతున్నారు. చిరుదాన్యాలతో పాటు వాటితో తయారు చేసే వంటలకు కూడా మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని ప్రజలు అంటున్నారు.

నేడు బోనాలలో ఎంపీ పర్యటన



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయం

లింగాల : మండలంలోని బోనాల గ్రామంలో సోమవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పర్యటించనున్నారని ఎంపీపీ రమాదేవి తెలిపారు. గ్రామంలోని సచివాలయం, విలేజ్ క్లీనిక్, రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించనున్నారని ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఆమె తెలిపారు.

మానసిక వికలాంగులను ఆదుకోవాలి



జనార్ధన్‌రెడ్డికి నగదును అందజేస్తున్న రామిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

వేంపల్లె : వివిధ మానసిక సమస్యలతో సమాజంచే వెలివేయబడ్డ మానసిక వికలాంగులను ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి రామిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన మనవరాలు ద్రితిసాయి కేశఖండన కార్యక్రమాన్ని పురస్కరించుకుని లింగాల సమీపంలోని దీనబంధు మానసిక వికలాంగుల ఆశ్రమానికి ఆరు నెలలకు సరిపడు వంట సరుకులకయ్యే మొత్తం రూ.90వేలను ఆశ్రమ నిర్వాహకులు జనార్ధన్‌రెడ్డికి అందజేశారు. భవిష్యత్తులో కూడా ఆశ్రమానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, కరస్పాండెంట్ బి.ఎస్.రమణారెడ్డి, ఆశ్రమ సహాయకులు పాల్గొన్నారు.

పేదల పాలిట వరం గరీబ్ కళ్యాణ్‌యోజన

వేంపల్లె : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం కింద పేద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యం వరంలాంటిదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పేద ప్రజల పట్ల చిత్తశుద్ధితో బీజేపీ కేంద్ర ప్రభుత్వం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకాన్ని మరో 5 ఏళ్ల వరకు పొడగించడం శుభపరిణామమన్నారు. కరోనా సమయంలో ప్రధాని నరేంద్రమోడీ ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. దీంతో దేశంలో 80 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా బియ్యం పంపిణీ జరుగుతోందన్నారు. అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు, ట్రిపుల్‌తలాక్, 370 ఆర్టికల్ రద్దు లాంటి సాహసోపేతమైన నిర్ణయాలతో ప్రధాని మోడీ అలుపెరుగని సేవలు చేస్తున్నారన్నారు. ముద్రయోజన, బేటీపడావో-బేటీబచావో, సుకన్య సమృద్ధియోజన, కిసాన్‌సమ్మాన్‌నిధి, పీఎం ఆవాస్‌యోజన, జల్‌జీవన్‌మిషన్, ఆయుష్మాన్ భారత్ తదితర 306 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : గరీబ్ కళ్యాణ్‌యోజన పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ మరో 5 సంవత్సరాలు పొడగించడం హర్షణీయం అని బీజేపీ ఎస్సీ మోర్చా నాయకుడు మేకల ఆంజనేయులు తెలిపారు. ఆదివారం ఎస్సీ కాలనీలో ఆంజనేయులు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

కడప అర్బన్: ఖాజీపేట మండలం భూమయ్యగారి పల్లె నుంచి మూడు రోజుల క్రితం గుర్తుతెలియని వృద్ధుడు(70) అనారోగ్యంతో బాధపడుతుండగా స్థానికుల సహకారంతో 108లో కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) క్యాజువాలిటీలో చేర్పించారు. డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి అతను చనిపోయాడని నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. అతనికి బంధువులు ఎవరూలేకపోవడంతో ఖాజీపేట పోలీస్ స్టేషన్ వారు కడపలోని శ్రీ కాశీ విశ్వనాథ సేవాసమితి వారిని సంప్రదించారు. దీంతో వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. శ్రీనాగుల వీరభద్రయ్య బ్రాహ్మణ అన్నదాన ట్రస్ట్ వారి సహకారంతో హిందూ సంప్రదాయం ప్రకారం వృద్ధుని మృతదేహానికి అంత్యక్రియలను నిర్వహించారు.

అంత్యక్రియల కార్యక్రమంలో శ్రీ కాశీ విశ్వనాథసేవా సమితి సభ్యులు ఆర్టీసి కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, ఆర్టీసి రిటైర్డ్ డీఎం నాగుల రాంప్రసాద్, రెడ్డెయ్య, పుట్టా పురుషోత్తం, ట్రాఫిక్ కానిస్టేబుల్ దినేష్ జంబ, కరాటే మాస్టర్ దామోదరం, గుండ్ల కొండ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన అవసరం



విజేతలతో అధికారులు

వైవీయూ : సమాజంపై అవగాహన, బాధ్యత ఎంతో అవసరమని రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ ఎస్. మాసూంబాషా పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని ఐఎంఏ సమావేశ మందిరంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. అనంతరం వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ, చిత్రలేఖన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ మాసూంబాషా జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు రెడ్డప్ప, ఖాదర్‌బాషా, జవహర్‌రెడ్డి, శ్రీనివాసులు, బాలగంగాధర్‌రెడ్డి, కిశోర్, అశోక్‌కుమార్, అజీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులను నివారించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా ప్రధాని కార్యదర్శి గాలిహరిప్రసాద్

వేంపల్లె : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో ప్రధానమైనదని, అటువంటి ఓటు హక్కును ఎలక్షన్ అధికారులు తప్పుల తడకగా రూపొందించడం జరిగిందని బీజేపీ జిల్లా ప్రధాని కార్యదర్శి గాలిహరిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు వేంపల్లె తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. స్థానిక గాజులపేట, ప్రియాతోటకు చెందిన ఓటర్లు బూత్ నెంబర్ 245, 244, బిడాల మిట్టలో ఉన్నాయని, బస్టాండు నుంచి బిడాలమిట్టకు వెళ్లి ఓటు వేయాలంటే చాలా దూరం ఉందని, కాబట్టి ప్రియాతోటకు దగ్గర్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలన్నారు. ఎలక్షన్ అధికారులు బిఎల్ఓలు క్షేత్రస్థాయిలో విచారించి సరైన ఓటరు జాబితాను ప్రజలకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అధునాతన పరిజ్ఞానంతో ఫొటోగ్రఫీకి ఆదరణ

కడప కల్చరల్ : ఫొటో, వీడియోగ్రఫీ రంగంలో రాణించేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ప్రముఖ ఫొటోగ్రఫీ టెక్నిషియన్, ఫ్యాకల్టీ కెనాన్ భూపాల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.చంద్రారెడ్డి, కడప అసోసియేషన్ అధ్యక్షులు శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఆదివారం నగర పరిధిలోని జయరాజ గార్డెన్స్‌లో ఆధునిక ఫొటో, వీడియో కెమెరాల నిర్వహణ, ఈ రంగంలో వస్తున్న మార్పుల గురించి, అందుకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలు గురించి ఆయన వివరించారు. ఉదయం వీడియోగ్రఫీపై, భోజనానంతరం ఫొటోగ్రఫీపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో కలిసి సంస్థ ఉపాధ్యక్షులు జిలానీబాషా, కార్యదర్శి శివరామకృష్ణ, సహ కార్యదర్శి ప్రభులు కెనాన్ భూపాల్ తోపాటు సీనియర్ ఫొటోగ్రాఫర్లు, సంఘం ప్రతినిధులను ఘనంగా సత్కరించారు.

మహాసభలను విజయవంతం చేయండి



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబు

జమ్మలమడుగు : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్దతకై నవంబర్ 11న హైదరాబాద్‌లో జరిగే విశ్వరూప మహాసభలను విజయవంతం చేయాలని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు పిచుక బాబు తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దండోర ప్రచార రథాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఎస్సీవర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో దశాబ్దాలుగా పోరాటం చేస్తోందన్నారు. అయితే ప్రస్తుతం ఎస్సీవర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం సైతం సుముఖంగా ఉంది. అందులో భాగంగా విశ్వరూప మహాసభలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా హజరై ఎస్సీవర్గీకరణపై ప్రకటన చేస్తారన్నారు. కాబట్టి మాదిగ సంఘ నాయకులు కార్యకర్తలు భారీగా హజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాళ్లబండి సంపత్‌ను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ 1978–79 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం టీటీడీ కళ్యాణ మండపంలో జరిగింది. ఇక్కడి పాఠశాలలో చదువుకుని వివిధ ప్రాంతాల్లో సెటిలైన వారంతా దాదాపు 43 ఏళ్ల తరువాత పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను తలుచుకున్నారు. అప్పటి తమ ప్రధానోపాధ్యాయుడు రాళ్లబండి సంపత్, ఉపాధ్యాయుడు కొవ్వూరు రాజగోపాల్‌రెడ్డిలకు పాదాభివందనం చేసి వారిని శాలువ కప్పి, జ్ఞాపిక, పూలమాలలతో సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాలతో ఈ వేడుకను జరుపుకొని అందరు గుర్తుగా ఫోటో తీయించుకున్నారు. పూర్వవిద్యార్థులు బివి.నాగప్రసాద్, రంగనాథ్, ప్రభాకర్ రెడ్డి, శాంతారామ్, కుంభం పాములేటి, రషీద్‌ఖాన్ పాల్గొన్నారు.